క్లుప్తంగా

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో శనేశ్వరస్వామి

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శనీశ్వరస్వామికి ప్రీతికరమైన ఆశాడమాసం శనివారం రోజున ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు , పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పూజారి నాగార్జున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పలుర కాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఆలయం ప్రాంగణం మామిడి తోరణాలు కట్టి స్వామివారికి ప్రీతికరమైన నల్లడి నూగులతో భక్తులు నూనె ఒత్తులు వెలిగించారు. భక్తులకు స్వామి దర్శనం కల్పించి, హంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

తెరుచుకుంటున్న వైకుంఠ ద్వారం


తలుపులు తెరిచిన వైకుంఠ ద్వారం

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి దేవాలయంలో వైకుంఠ ద్వారం రోజు తెరుస్తుండటంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వైకుంఠ ద్వారం వైకుంఠ ఏకాదశి రోజున తెరిచి భక్తులను అనుమతిస్తారు. తరువాత వైకుంఠ ద్వారం మూసివేస్తారు. హిందూ సంప్రదాయానికి విరుద్ధంగా వ్యహరిస్తుండటంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ మనోభావాలు దెబ్బతినకుండా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కలికిరి: ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్ఐ దేవేంద్ర కుమార్ అన్నారు. హెల్మెట్ వాడకంపై స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని తెలిపారు. ప్రమాదాలలో చాలా వరకు హెల్మెట్ వాడకపోవడంతో మరణాలు సంభవిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మహబూబ్ బాషా, హెచ్‌సీలు రఫీ, కొండప్ప, పీసీలు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేయాలి

పీలేరు రూరల్ : మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేయాలని ఎంఈవో వై. లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జూలై 5 నాటికి వాస్తవ విద్యార్థుల సంఖ్య ప్రకారం స్టూడెంట్ కిట్స్, బుక్స్ వచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మధ్యాహ్న భోజనం వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మదనపల్లె సిటీ: వారాహి నవరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ లలితత్రిపుర సుందరి అమ్మవారికి అర్చకులు ఆలూరి ఫణికుమార్‌శర్మ ఉదయం పంచామృతాభిషేకం, వారాహి అష్టోత్తరం, లలిత సహస్రనామ స్తోత్ర పారాయణం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎంఈఓ నారాయణ, ఎంఈఓ-టూ గోస్‌పీర్‌లు సూచించారు. శనివారం స్థానిక మోడల్ స్కూల్‌లో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే టీచర్లకు విద్యా ప్రవేశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

పెరిగిన టమాటా దిగుబడి

- తగ్గుముఖం పడుతున్న ధరలు
- మార్కెట్‌కు భారీగా తెస్తున్న టమాటాలు

తేదీ	దిగుబడులు (క్వింటాళ్లు)	మొదటి గ్రేడ్ (కిలో ధర)
6-7-24	1439	రూ.52
5-7-24	1468	రూ.50
4-7-24	1434	రూ.44
3-7-24	1411	రూ.50
2-7-24	1403	రూ.46
1-7-24	1424	రూ.48


మార్కెట్‌కు తీసుకువచ్చిన టమటాలు

మదనపల్లె సిటీ: మదనపల్లె మార్కెట్‌కు రోజు రోజుకు టమటాలు అధికంగా వస్తున్నాయి. దిగుబడులు పెరగడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. మదనపల్లెతో పాటు పరిసర ప్రాంతాల నుంచి రైతులు వాహనాల్లో టమాటాలు మార్కెట్‌కు తెస్తున్నారు. దీంతో స్థానిక చౌడేశ్వరి సర్కిల్ నుంచి మార్కెట్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి. ధరలు పెరుగుతుడటంతో రైతులు టమటా పంటపై మొగ్గు చూపారు. ధరలు పుంజుకుంటున్న సమయంలో దిగుబడులు కూడా పెరగడంతో ధరలు తగ్గుముఖం పట్టాయి. టమటా కిలో రూ.92 వరకు పలికింది. తరువాత ధరలు రోజు రోజులు తగ్గిపోయాయి. ధరలు తగ్గుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

- పెంపుడు శునకాలకు టీకాలు వేయించిన జంతుప్రేమికులు
- వ్యాధులపై అప్రమత్తత అవసరమన్న వైద్యులు


మదనపల్లె: పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న ఏడీ రోహిణి


వాల్మీకిపురం: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జులేఖ బేగం

మదనపల్లె : ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏరియా పశువైద్యశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా 120 కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా పశుసంవర్థకశాఖ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్.సత్యనారాయణ, సహాయసంచాలకులు డాక్టర్.రోహిణి, విశ్వేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ...నేడు మూగజీవాల పెంపకంపై ఎంతో మంది శ్రద్ధ చూపుతున్నారని, అందుకే ప్రస్తుతం అవి మానవజీవితంతో ముడిపడ్డాయన్నారు. ఎంతో ఇష్టంగా సాకుతున్న జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైనదని, పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885 జూలై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటిసారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారని, ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందడంతో ప్రతి ఏటా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునాటిక్ డిసీజస్ అంటారన్నారు. ఇవి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పశువైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దన్నారు. పశువుల వ్యాధులపై సలహాల కోసం ప్రభుత్వం 1962 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటుచేసిందని, కుక్కలకు మామూలుగా కరిచే గుణం ఉంటుందని, రేబిస్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరు తమ పెంపుడు జంతువులైన కుక్కలకు టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యడాక్టర్లు శిరీన్‌లారెన్స్, దివ్య, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఎస్.నరసింహారెడ్డి, జీ.వి.ఓ. అనిల్, ఖాదర్‌వలీ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

జూనొసిస్ డేపై అవగాహన

వాల్మీకిపురం: కుక్కలను పెంచుకునే వారంతా వారి కుక్కలకు యాంటి ర్యాపిడ్ వ్యాక్సిన్‌ను వేయించాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి జులేఖ బేగం అన్నారు. శనివారం మండలంలోని చింతపర్తి, తాటిగుంటపల్లిలో జంతువుల ద్వారా మనుష్యులకు వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్రెంచ్‌శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ మొట్టమొదటిసారిగా 1885లో మొదటి టీకాను కనుగొన్నారన్నారు. జూనోటిక్ వ్యాధులు మనుషుల నుంచి పశువులకు, పశువుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయన్నారు. రేబిస్, బ్రుసెల్లోసిస్, ఆంథ్రాక్స్, మెదడువాపు వ్యాధి తదితర వ్యాధుల నివారణ, టీకాలపై వివరించారు. అనంతరం పశువుల ఆసుపత్రిలో 14 కుక్కలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి అనూష, వైద్య సిబ్బంది ఇందిర, మహమ్మద్ రఫీ, సుధాకర్, భానుబి, పుష్ప, రమ్య, రెడ్డెమ్మ, మహేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

కలికిరి: కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోని కలికిరి, మహల్, మేడికుర్తి, పాళెం పశువైద్యశాలల్లో శనివారం జోనోసిస్ డే సందర్భంగా 50 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు వేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటమునినాయుడు తెలిపారు. పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే రేబిస్, బ్రుసెల్లోసిస్, ఆంత్రాక్స్, బర్డ్‌ఫ్లూ, హైడా సిడోసాస్, లెప్టసిరోసిస్, టీబీ, సాల్మనెల్లోసిస్ తదితర వ్యాధులు రాకుండా వ్యాక్సిన్ ఉపయోగపడనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులపై అవగాహన

తంబళ్లపల్లె: జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన ఉండాలని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ సుమిత్ర తెలిపారు. శనివారం పశువైద్యశాలలో జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. సుమారు 30 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. పెంపుడు కుక్కలకు యజమానులు తప్పకుండా టీకాలు వేయించాలన్నారు.

బడుగుల ఆశాజ్యోతి జగజ్జీవన్‌రామ్


పీలేరు: బాబు జగజ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పీలేరు : బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగజ్జీవన్‌రామ్ అని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుధాకర్‌బాబు అన్నారు. శనివారం బాబు జగజ్జీవన్‌రామ్ 38వ వర్థంతిని పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్, మాలమహానాడు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతావనిలో కుల నిర్మూలన, అంటరానితనం కోసం అహర్నిషలు కృషి చేశారన్నారు. గొప్ప సంఘ సంస్కర్త, భారత ఉపప్రధాని, రైల్వే శాఖ మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా పార్లమెంటులో సుమారు 40 సంవత్సరాలు పని చేసి దళితుల అభివృద్ధి కోసం పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ముల్లంగి చంద్రయ్య, గుర్రం నారాయణ, బొమ్మల కుమార్, జగదీష్, సద్దల నవీన్‌కుమార్, సద్దల ప్రేమ్‌కుమార్, కె. తిమ్మయ్య, ప్రసాద్, శ్రీకాంత్, నవీన్, మునిరాజ, నరసింహ, కృష్ణ, హరినాథ, శ్రీనివాసులు, రామాంజులు, వెంకటరమణ, రమణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

హుండీ ద్వారా రెడ్డెమ్మకొండకు ఆదాయం


రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో హుండీ ద్వారా రూ.7,03,377ఆదాయం వచ్చింది. శనివారం స్థానిక ఆలయంలో రాయచోటి దేవదాయశాఖ అధికారి రవికిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మూడునెలల కాలానికి సంబంధించి అమ్మవారి ఆలయానికి వివిధ కానుకల ద్వారా 40.78 గ్రాముల బంగారు, 600.830 గ్రాముల వెండి వచ్చింది. నగదు రూపంలో రూ. 7,03,377ఆదాయం వచ్చినట్లు రెడ్డెమ్మకొండ ఈఓ మంజుల తెలిపారు. ఈ మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో జమచేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాలకృష్ణ, వెంకటరమణ, మహేష్, అర్చకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌పీ మృతికి సంతాపం


చంద్రశేఖర్ (ఫైల్)

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె మండలం విద్యాశాఖలో పని చేసే సీఆర్‌పీ చంద్రశేఖర్ (52) మృతికి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన మృతి చెందాడు. వివరాలిలా..మదనపల్లెకు చెందిన చంద్రశేఖర్ మండలంలోని విద్యాశాఖ కోసువారిపల్లె సీఆర్‌పీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మదనపల్లె ఉన్నత పాఠశాలలో టీచర్లకు, సిఆర్‌పిలకు టీచ్ టూల్స్ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. తనకు గుండె నొప్పిగా ఉందని కుటుంబీలకు తెలిపారు. ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లడంతో అక్కడి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జిల్లా సమగ్రశిక్ష సీఎంఓ కరుణాకర్, సిఆర్‌పి సంఘ నాయకులు గోవర్ధన్, సుధాకర్, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, ఉపాధ్యాయులు మృత దేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. మృతుని భార్య భారతి, కుమార్తెలు నిఖిత, సంగీతలను ఓదార్చారు. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిర్వహణకు సిఆర్‌పిల సంఘం, అధికారులు, టీచర్లు రూ.1.50 లక్షలు ఆర్థిక సహాయంను అందించారు. అతని కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీసీజీ టీకా సురక్షితం



ప్రెస్‌క్లబ్‌లో బీసీజీ టీకాలు వేస్తున్న ఆరోగ్యసిబ్బంది

మదనపల్లె : క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ టీబీ ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బీసీజీ వ్యాక్సినేషన్ సెంటర్ ఏర్పాటుచేసి, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, కుటుంబ సభ్యులు, బీటీ కళాశాల టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. వయోజనుల బీసీజీ టీకా సురక్షితమని, ఎటువంటి అపోహలు లేవని, ప్రతి ఒక్కరూ తప్పకుండా టీకా వేయించుకుని క్షయవ్యాధి నుంచి విముక్తి పొందాలని ఆయన పేర్కొన్నారు. గడచిన 5 ఏళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వాళ్లు తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. అదేవిధంగా 18ఏళ్లు నిండిన వారు, పొగతాగేవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, శరీర ద్రవ్యరాశి సూచిక 18 కన్నా తక్కువ ఉన్నవారు, టీబీ రోగులతో సన్నిహితంగా ఉండేవారు ఈ బీసీజీ టీకాలను తప్పకుండా వేయించుకోవాలన్నారు. వ్యాక్సిన్ వేసిన చోట బొబ్బగానీ, మచ్చగానీ ఏర్పడినా.. భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్, సిబ్బంది దయాకర్, శాంతి, వనజకుమారి, ఏఎన్ఎం ఉమాదేవి, ఝాన్సీ, ఆశా వర్కర్ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో ఆదివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామివారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులను చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చివరగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలతో కల్యాణోత్సవం నిర్వహించారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనంద రెడ్డి, కేశవ రెడ్డి, అశోక్ కుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

అధికారులు అవినీతికి దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

గుర్రంకొండ: అధికారులు అవినీతికి దూరంగా ఉండాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. అవినీతికి ఎంత దూరంగా ఉంటే అధికారులకు అంతమంచిదన్నారు. గుర్రంకొండ మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, మురుగునీటి కాలువలు కూడా లేవని అన్నారు. పంచాయతీ ఈవో విశ్వనాథ్‌ను లేపి మేజర్ పంచాయతీలో నిధులు లేవా అని ప్రశ్నించారు. నిధులు ఉంటే వీటిపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై అధికారులతోపూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామన్నారు. ఇంటిప్లాన్ అప్రూవర్లతో పాటు మరికొన్ని నకిలీ బిల్లులతో పంచాయతీలో పలు అక్రమాలు జరిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణలో వాస్తవాలు తేలితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఎంపీడీఓ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు జగదీష్, ఎల్లుట్ల మురళీ, సుంఖరశేఖర, చలామారెడ్డి, చంద్రబాబు, ప్రసాద్‌నాయుడు, బయ్యారెడ్డి, ఆనంద, సుబ్బరాజులు పాల్గొన్నారు.

విత్తనకాయల పరీక్ష నమూనా ప్రదర్శన


వేరుశనగ విత్తన కాయల నాణ్యత పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

గుర్రంకొండ: మండలంలోని ఎల్లుట్ల, సంగసముద్రం, గుర్రంకొండ ఆర్బీకేల్లో వేరుశనగ విత్తన కాయల పరీక్ష నమూనాను ప్రదర్శించారు. ఖరీఫ్‌సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడానికి ముందుగా విత్తనకాయల పరీక్షను వ్యవసాయశాఖ సిబ్బంది నిర్వహిస్తుంటారు. శనివారం ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో ఇటీవల రైతులకు పంపిణీ చేసిన టీజీసీఎస్, నారాయణి, కే6 రకం విత్తనకాయల మొలకెత్తిన నమూనాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బంది, అధికారులు రైతులకు వీటిపై అవగాహన కల్పించారు. ఒక ట్రేలో మట్టి ఇసుకను ఎరువులతో నింపి మూడు రకాల విత్తనకాయల్ని వేర్వేరు ట్రేలలో 100 విత్తన గింజల్ని విత్తినట్లు రైతులకు వారు పేర్కొన్నారు. 12 రోజుల అనంతరం మొలకెత్తే శాతం మేరకు నాణ్యత పరీక్ష తెలుస్తుందన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 80 నుంచి 90 శాతం వరకు మొలకెత్తితేనే నాణ్యమైన విత్తనాలుగా నిర్ధారించవచ్చు. ప్రస్తుతం నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మేరకు విత్తనాలు మొలకెత్తినట్లు వారు పేర్కొన్నారు. ఇలా చేయడం వలన రైతులు తాము కొనుగోలు చేసిన వేరుశనగ విత్తనకాయల్లో మొలకెత్తే శాతం తెలిసిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రిజ్వానా, వీహెచ్ఏ సమీనా, వీఏవో నవాజ్‌లు పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన


కేవీకే నర్సరీలో మామిడి మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు

కలికిరి: రైతులకు నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించి మంచి దిగుబడులు సాధించేలా కృషి చేయాల్సిన బాధ్యత కేవీకే శాస్త్రవేత్తపై ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డా. బి. ప్రమీల రాణి, డా. బి.ముకుందరావు అన్నారు. కలికిరి కేవీకేను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రదర్శనా క్షేత్రాలలోని వేరుశనగ విత్తనోత్పత్తి, సమగ్ర కోళ్ల, గొర్రెల పెంపకం, వర్మీ కంపోస్టు, మామిడి మొక్కలు, అజోల్లా పెంపకం తదితరాలను తనిఖీ చేసిన వారు కేవీకే శాస్త్రవేత్తలకు సూచనలు, సలహాలిచ్చారు. కేవీకే ఆధ్వర్యంలో క్షేత్ర ప్రదర్శనలు విరివిగా నిర్వహించడంతో పాటు, కేవీకేలో ఈగ బుట్టలు, మామిడి ఫ్రూట్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డా. పాండురంగ, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌బాషా

పీలేరు : ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ మహబూబ్ బాషా అన్నారు. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ దిగువయల్లంపల్లె సమీపంలో సర్వే నెంబరు 1145లో గత రెండు మూడు రోజులుగా కొందరు వ్యక్తులు గుట్టలను చదును చేస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు అందిన సమాచారంతో శనివారం తహశీల్దార్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. చదును చేస్తున్న జేసీబీలను పంపివేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


కాలువల్లో పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

డీపీఓ ధనలక్ష్మి

వాల్మీకిపురం: వర్షాలు కురుస్తుండడం వలన సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని డీపీఓ ధనలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి, చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. మురుగు నీరు రోడ్లపైకి రాకుండా, నిల్వ లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీకి సంపదను సృష్టించాలన్నారు. అనంతరం పలు వీధులు పర్యటించి, మురుగు కాలువలను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో ఆలయంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.